# సి అండ్ యండిని కలిసిన ఎమ్మెల్యే



**ఇల్లందు, ఫిబ్రవరి 8, ప్రజాజ్యోతి:**

సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం ను శనివారం హైదరాబాద్ లోని సింగరేణి భవన్ లో ఎమ్మెల్యే కోరం కనకయ్య కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సింగరేణికి పుట్టినిల్లయిన ఇల్లందు మనుగడ కోసం త్వరితగతిన జేకే 5 ఓసి పోడగింపు (పూసపల్లి) ప్రాజెక్ట్ పనులు ప్రారంభించాలని కోరారు. అదే విదంగా నూతన ఓసి వల్ల నిర్వాసితులకు మెరుగైన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి ఇవ్వాలన్నారు. కోయగూడెం పిట్ 3 ప్రాజెక్ట్ ప్రైవేట్ సంస్థకు కాకుండా సింగరేణి సంస్థ ద్వారానే పనులు చేయాలని పేర్కొన్నారు. ఇల్లందు నియోజకవర్గం అభివృద్ధి కోసం సిఎస్ఆర్ ఫండ్ ఇచ్చి సహకరించాలని కోరారు. సి అండ్ యండి సానుకూలంగా స్పందించి ఇల్లందు మనుగడకు ఎలాంటి డోకా ఉండదని, ఇల్లందు నియోజకవర్గ. అభివృద్ధి కోసం తమ సహకారం ఉంటుందని స్పష్టం చేసినట్టు ఎమ్మెల్యే తెలిపారు.


జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం | 9 | ఫిబ్రవరి | 2025 ◆ పేజీలు : 4




# అయ్యోపాపం..

# గిరి 'జనం'



- భద్రాద్రి జిల్లాలో మానవ అక్రమ రవాణ
- కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం
- దోపిడికి గురౌవుతున్న వలస గొత్తికోయలు

2 లో..




# ఘనంగా జిల్లా పోలీస్ యాన్యువల్ స్పోర్ట్స్ మీట్-2025 ముగింపు వేడుకలు

### మూడు రోజులు పాటు విజయవంతంగా జరిగిన స్పోర్ట్స్ మీట్లో గెలిచిన విజేతలను అభినందించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్

**కొత్తగూడెం కలెక్టరేట్, ఫిబ్రవరి 8, ప్రజా జ్యోతి**

మూడు రోజుల పాటు జరిగిన జిల్లా పోలీస్ యాన్యువల్ స్పోర్ట్స్ మీట్–2025 ముగింపు వేడుకలు జిల్లా పోలీస్ హెడ్క్వార్టర్స్ నందు ఘనంగా నిర్వహించారు ,జిల్లా పోలీస్ శాఖలోని అన్ని విభాగాలలో పనిచేస్తున్న పోలీసు అధికారులు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ముందుగా ఈ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ 100 మీటర్స్ పరుగు పందెం ఫైనల్ టగ్ ఆఫ్ వార్ ఫైనల్ మ్యాచ్ లను తిలకించారు. అనంతరం ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ పోలీస్ అధికారులు , సిబ్బంది ఎంతో ఉత్సాహంగా క్రీడా పోటీలలో

మిగతా 2 లో...

# అంతర పంటల సాగు ద్వారా రైతులు ఆర్థిక అభివృద్ధి చెందవచ్చు

### జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్



2 లో...



# పుచ్చసాగుతో అధిక దిగుబడులు

- -3నెలల్లో పంట చేతికి
- -పెట్టుబడి తక్కువ
- -దిగుబడి ఎక్కువ
- -ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరం...!

**ఇల్లందు, ఫిబ్రవరి 8, ప్రజాజ్యోతి:**

ఎండాకాలం సమీపించడంతో బయటకు వెళితే ఎండ వేడిమి అధికంగా ఉంటుంది.. ఈ వేడిమితో అతి దాహం, చెమట ద్వారా ఖనిజ లవణాల లోపాలను పుచ్చకాయ తగ్గిస్తుందని వైద్యులు తెలుపుతున్నారు.. ఇల్లందు పట్టణం లోని ప్రధాన కూడళ్లలో నలుపు, తెలుపు పుచ్చకాయల విక్రయాలు జరుగుతున్నాయి. కేజీల చొప్పున కాయలను బట్టి అమ్మకాలు జరుగుతున్నాయి. తెలుపు పుచ్చకాయ కేజీ రూ. 40, నలుపు పుచ్చకాయ కేజీ రూ. 50 చొప్పున అమ్ముతున్నారు. పుచ్చకాయలను ఎక్కువగా ఆంధ్రప్రదేశ్ నుంచి రవాణా చేసుకోవడం జరుగుతుంది. పుచ్చకాయల వలన ప్రజలు ఉపశమనం పొందవచ్చు. ఈకాయల సాగు రైతాంగానికి ఎక్కువ దిగుబడినిస్తూ పెట్టుబడి తక్కువగా ఉంటుందని, ఎక్కువ శ్రమ ఉండదని రైతులు పేర్కొంటున్నారు. 3 నెలల్లో పంట చేతికి వస్తుండడంతో ఎక్కువ మంది రైతులు దీనిపై దృష్టి సారిస్తున్నారు. అతి తక్కువ కాలంలో చేతికి వచ్చే పంట పుచ్చకాయే. జ్వరంతో బాధపడుతున్న వారు పుచ్చకాయ రసంలో తేనే కలిపి సేవిస్తే శారీరక

మిగతా 2 లో...

## పుచ్చసాగుతో అధిక దిగుబడులు



(మొదటి పేజీ తరువాయి...)

నీరసం తగ్గి శక్తినిస్తుంది. మలబద్ధకం ఉన్నవారు ప్రతిరోజూ పుచ్చకాయలను తింటే మలబద్ధకం అంతరించిపోతుంది. ఎండిపోయే పెదాలను తడిగా ఉంచుతుందని, పుచ్చకాయలో ఉన్నంత నీటి శాతం మరే ఇతర కాయ, పండ్లలో ఉండవు. మూత్ర విసర్జనలో మంట ఉన్నవారికి పుచ్చకాయ చక్కని ఔషధంగా పని చేస్తుంది. ఎండ వేడిమి ఉపశమనం పొందడానికి కొబ్బరి బొండాలు, చెరుకు రసాలను విక్రయించే వారు పెరిగిపోతున్నారు. నీరు ఎక్కువగా ఉండే పుచ్చకాయలో పొటాషియం, ఎలక్ట్రోరల్ వంటి పోషకాలు అధికంగా లభిస్తాయి. శరీరాన్ని చల్లబరుచుకోవడానికి ఈకాయ ఎంతగానో ఉపయోగపడుతుంది. పుచ్చకాయలో విటమిన్ బి అధికంగా ఉండడం వలన గుండెజబ్బులు వచ్చే అవకాశం ఉండదని వైద్యులు తెలువుతున్నారు. పుచ్చగింజలను నీటిలో వేసి మరిగించి తేనీరుగా సేవించడం వలన కిడ్నీ సంబంధ వ్యాధులు దూరమవుతాయి. జ్ఞాపక శక్తి ఏకాగ్రత పెరగడానికి పుచ్చగింజలు ఎంతగానో దోహదపడుతాయని వైద్యులు పేర్కొంటున్నారు.

## ఘనంగా జిల్లా పోలీస్ యాన్యువల్ స్పోర్ట్స్ మీట్-2025 ముగింపు వేడుకలు





(మొదటి పేజీ తరువాయి...)

పాల్గొని తమ ఆసక్తిని చూపినందుకు చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఉత్కంఠ భరితంగా సాగిన కొన్ని క్రీడా పోటీలను చూసి సిబ్బంది లోని పోరాట పటిమను గమనించానని తెలిపారు.వయసుతో కూడా సంబంధం లేకుండా కొంతమంది అధికారులు,సిబ్బంది చాలా ఉత్సాహంగా పాల్గొనడం సంతోషదాయకంగా ఉందని తెలిపారు.ఈ స్పోర్ట్స్ మీట్లో విభాగాల వారీగా జరిగిన క్రీడా పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి అభినందనలు తెలియజేసి వారికి మెడల్స్ ను అందజేశారు.పోటీ ప్రపంచంలో గెలుపోటములు సహజమని,క్రీడలలోనే కాదు జీవితంలో కూడా ఎదురయ్యే ఒడిదుడుకులను సమర్ధవంతంగా ఎదుర్కోవాలని సూచించారు. స్పోర్ట్స్ మీట్ ను అద్భుతంగా ఏర్పాటు చేసిన అధికారులు,సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.అనంతరం సబ్ డివిజన్ల వారీగా క్రీడాకారులు స్పోర్ట్స్ మీట్ ముగింపు పేరెడ్ తో ఎస్పీ గౌరవ వందనాన్ని సమర్పించారు. భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపిఎస్ విజ్ఞప్తి మేరకు జిల్లా ఎస్పీ జిల్లా పోలీస్ యాన్యువల్ స్పోర్ట్స్ మీట్ 2025 ను ముగిస్తున్నట్లుగా ప్రకటించారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని పోలీసు అధికారులు, సిబ్బంది తమ అనందత్సవాలను వ్యక్తపరిచారు.

# అయ్యో...పాపం...
# గిరి 'జనం'



*భద్రాచలం టౌన్, ఫిబ్రవరి 9 ప్రజాజ్యోతి :*

భద్రాచలం పట్టణానికి ఒడిశా, చత్తీస్గడ్, మధ్యప్రదేశ్ నుంచి బతుకు జీవుడా అంటూ పొట్ట చేత పట్టుకుని పనుల కోసం వస్తున్న ఆదివాసీలను కొందరు కాంట్రాక్టర్లు ముందే పసిగట్టి వారిని మాటల్లో పెట్టి పనుల పేరుతో పైసలు ఇస్తాం అని చెప్పి సాక్ష్యాత్తు బయట ప్రాంతాల వారికి అమ్ముకుంటున్నారు. గిరిజన పల్లెల్లోనూ, అటవీ ప్రాంతాల్లో కాకుండ సాక్షాత్తూ భద్రాచలం నడిబొడ్డున ఈ తతంగం జరుగు తున్నప్పటికీ పట్టించుకునే వారు లేరు. బహిరంగంగానే సాగుతున్న ఈ మానవ అక్రమ రవాణా కొందరికి మధ్యవర్తులకు కాసులు పంట పండిస్తున్నారు. ఇది ఇలా ఉండగా ఆదివాసీలకు మాత్రం ఆకలి మంటలను మిగులుస్తోంది. వ్యవసాయ సీజన్ ముగిసిన తర్వాత అడవుల్లో పనులు లేక చత్తీస్ ఘడ్, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఆదివాసీలు పనుల కోసం ఇక్కడికి వస్తుంటారు. వారిని ఇక్కడి నుంచి పనులకు వేరే ప్రాంతాలకు కాంట్రాక్టు ప్రాతిపదికన పంపుతున్న మధ్యవర్తుల ఆగడాలు హెచ్చు మీరిపోతున్నాయి.

సుమారు 50 మందికి పైగా ఉన్న మానవ అక్రమ రవాణా చేసే మధ్యవర్తులు తమ వద్దకు పనికి రావాలని ఆదివాసీలపై బెదిరింపులకు పాల్పడుతూ, పనికి వస్తే సరే లేదంటే వారి చేతుల్లో ఉన్న సంచులు బలవంతంగా తీసుకోని వారి వెంట వచ్చేలా చేస్తున్నారు. అయినా మాట వినకుంటే వారిపై చేయి చేసుకుంటున్నారు. ఆదివాసీ కూలీలు పనులకు వచ్చిపప్పటికీ చేసిన కష్టానికి ప్రతిఫలం దక్కడం లేదు. వారి చెమట చుక్కలను ఇక్కడి దళారులు సొమ్ములు చేసుకుని స్వార్జితంలో అనుభవిస్తున్నారు. ఒకప్పుడు పూటగడవటం కూడా కష్టంగా ఉన్న ఏజెంట్లుగా చెప్పుకునే వారి స్థితిగతులు ఒక్కసారిగా మారిపోయాయి. మానవ అక్రమ రవాణా చేసి సంపాదించుకున్న వారు దానినే అంగబలంగా భావించి మార్చుకుంటున్నారు. ఇది అన్యాయం అని ప్రశ్నించే వారినే ఎదిరించే స్థాయికి వెళ్లిపోయారు. ఎవరు అడ్డు తగిలి వారిని డబ్బు రుచి చూపించి కట్టడి చేస్తాం అంటూ బహిరంగంగా చెప్పుకుంటున్నారు. వారికి ఇంత ధీమా ఎక్కడ్నుంచి వచ్చింది. వీరి వెనుక ఉన్నది ఎవరు, ఎవరికి వాటాలు వెలుతున్నాయి అన్న దానికి సమాధానం లేకుండా పోయింది . మానవ అక్రమ రవాణా వెనుక బిగువున ఎలాంటి అడ్డు అదుపు లేకుండా ఏళ్ల తరబడి సజావుగా సాగించటం వెనుక అండదండలు పుష్కలంగానే ఉన్నట్లు పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్ సమీపంలో ఆదివాసీలను కూలీలకు తరలించటం బహిరంగానే జరుగుతుంది. నిత్యకృత్యంగా మారిన ఈ తంతంగం దళారులతో పాటు కొందరికి కాసులు కురిపిస్తున్నట్లు బహిరంగంగానే చర్చ సాగుతోంది. లేబర్ చట్టాలకు విరుద్ధంగా సాగుతున్న ఈ వ్యవహారం పూర్తి అక్రమమే అని తెలిసినప్పటికీ ఎందుకు పట్టించు కోవడం లేదు. లైసెన్సులు లేకుండా, కూలీలను ఎక్కడ ఎక్కడికి పంపిస్తున్నదీ అనే వివరాలు లేబర్ ఆఫీస్ లో సమర్పించాల్సి ఉన్నప్పటికీ అది అరకొరగానే సాగుతున్నట్లు వినికిడి. అధికారుల వద్ద ఎలాంటి వివరాలు లేకుండా పనులకు వెళ్లిన చోట అనేక మంది ప్రమాదాలకు గురైన సందర్భాలు ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో ప్రాణాలకు సైతం గ్యారెంటీ లేకుండా పోతోంది. అడుగడుగునా నిఘా పెట్టాల్సిన అధికారులు అంటీ ముట్టనట్లుగా వ్యవ హరించడం ఇట్టి అక్రమం సజావుగా సాగితుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఆదివాసీల అమాయకత్వం వీరికి కాసులు కురిపిస్తోంది. అది ముమ్మాటికీ అక్రమమే అని తెలిసినా కొందరు నోరు మెదపక పోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. దీంతో మానవ అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకపోగా, అండందడలు మాత్రం పుష్కలంగా ఉన్నాయనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మరి కొందరు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఏదైనా ఆఫీసుల్లో కూలీ పనులు చేయాలంటే కొందరు అధికారులు ముందుగా లేబర్ కాంట్రాక్టర్లకే కబురు పెడుతున్నట్లు తెలుస్తోంది. వారు ఇతర ప్రాంతాల నుంచి పనుల కోసం వచ్చిన వారిని అక్కడ పనులు చేసేందుకు పంపుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఏజెంట్లు మరింత రెచ్చిపోతున్నారు. అధికారులే నేరుగా తమకు ఫోన్ చేసి కూలీలకు పంపాలని అడుగుతున్నారని, మా పనులకు ఇంకా ఎవరు అడ్డు రారని బహిరంగంగా అంటు న్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్రమ మానవ రవాణాను చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఆదివాసులకు న్యాయం చేయాలని పలువురు కోరుకుంటున్నారు.

## అంతర పంటల సాగు ద్వారా రైతులు ఆర్థిక అభివృద్ధి చెందవచ్చు



*కొత్తగూడెం కలెక్టరేట్, ఫిబ్రవరి 8, ప్రజాజ్యోతి*

రైతులు ఒకే పంట మీదే ఆధారపడకుండా అంతర్ పంటల సాగు ద్వారా ఆర్థిక అభివృద్ధి చెందవచ్చు అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. శనివారం ములకలపల్లి మండలంలో కలెక్టర్ పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ముందుగా ములకలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మట్టితో తయారుచేసిన ఇటుకలు తో నిర్మించే ప్రహరీ గోడ పనులను కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ ప్రహరీ గోడ నిర్మాణానికి స్థానికంగా మట్టితో తయారుచేసిన ఇటుకలను ఉపయోగించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పాతూరులో ఈదర మురళి అనే రైతు సాగు చేస్తున్నటువంటి ఫామ్ పౌండ్ లో చేపల పెంపకాన్ని పరిశీలించి, ఇంకా ఫామ్ పాండ్ అభివృద్ధి పరచటానికి ఏ రకం చేపల పెంపకం ద్వారా ఎక్కువ ఆదాయం చేకూరుతుందో తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఒక్క పంట పైనే ఆధారపడకుండా అంతర్ పంటగ చేపల పెంపకం, మునగ, నాటు కోళ్లు తేనెటీగల పెంపకం వంటివి సాగు చేయడం ద్వారా ఆర్థిక అభివృద్ధి చెందవచ్చు అని తెలిపారు. ఈ అంతర పంటల సాగుకు ఎన్ ఆర్ జి ఎస్ ద్వారా మునగ పంట వేసుకున్న వారికి అన్ని విధాలుగా ప్రోత్సాహకాలు సబ్సిడీలు అందుతాయని అదేవిధంగా పంట చేనులో ఫారం ఫాండ్లు ఎన్ ఆర్ జి ఎస్ ద్వారా తీయడం జరుగుతుందని ఈ ఫారం పాండ్లలో రైతులు చేపల పెంపకం చేసుకుంటే లాభదాయకంగా ఉంటుందని తెలిపారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ఎంపీడీవో రేవతి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జెకె ఓసి పని ప్రదేశాలను సందర్శన



*ఇల్లందు, ఫిబ్రవరి 8, ప్రజాజ్యోతి:*

సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా జెకె ఓసి పని స్థలాలను శనివారం.ఎఐటి యుసి అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (గుర్తింపు సంఘం) ప్రతినిధి బృందం సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె. సారయ్య మాట్లాడుతూ జెకె ఓసి ప్రారంభ దశ నుండి నేటి వరకు ఉత్పత్తి, రక్షణలో సింగరేణి వ్యాప్తంగా అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ఇటీవల ప్రైవేటు దుర్గా కంపెనీ ఓబి టెండర్ ఇచ్చారని, టెండర్ కాల పరిమితి ముగిసిన తర్వాత జెకె ఓసిని ఇల్లందులో గతం 21 ఫీట్ మైన్ బంద్ అయిన తర్వాత కార్మికుల సంఖ్య తగ్గిందని తెలిపారు. జియం, పిఓ మేనేజర్ అధికారులు, కార్మికులు సమిష్టిగా ఛాలెంజ్ గా తీసుకొని ఇట్టి ఓబి బొగ్గును పాత మిషనరీ, మాన్ పవర్ తక్కువగా ఉన్న గత 3 సంవత్సరాలుగా సింగరేణిలోనే అధిక శాతం ఉత్పత్తితో యాక్సిడెంట్ లేకుండా జెకె ఓసిని నడపడం జరుగుతుందని తెలిపారు. జెకె ఎక్స్టెన్షన్ రాకపోవడం వల్ల సుమారు 600 మంది కార్మికులు, ఇల్లందు ఏరియాను కాపాడుకోవడం జరుగుతుందని ఎక్స్టెన్షన్ ఓసి వచ్చేంతవరకు ఎన్ని అవాంతరాలు వచ్చిన అధికారులు, కార్మికులు సమిష్టి కృషితో ఎన్నో అవార్డులు సాధించిన చరిత్ర ఓసికి ఉందన్నారు. ఇల్లందు ఏరియా జియం ఉన్నతాధికారులు, కార్మికుల సహకారంతో సేఫ్టీగా ఉన్న బొగ్గు నిలువలను తీసి ఇల్లందు జెకె ఓసి ఎక్స్టెన్షన్ వచ్చేవరకు యాజమాన్యం చొరవ తీసుకొని ఓసిని నడిపించాలని కోరారు. సింగరేణిలో గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ జెకె ఓసి విస్తరణ జరిగేవరకు కార్మికులకు అండ గా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెకె ఓసి బ్లాస్టింగ్ ఇంచార్జి కీషన్ నాయక్, బ్రాంచ్ ఉపాధ్యక్షులు దాసరి రాజారాం, ఫిట్ కార్యదర్శి సంజీవచారి పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్స్ ప్రారంభం



*ఇల్లందు, ఫిబ్రవరి 8, ప్రజాజ్యోతి:*

పరశురాం యూత్ ఆధ్వర్యంలో స్థానిక జెకె కాలనీలోని సిఈఆర్ క్లబ్ గ్రౌండ్ లో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ను శనివారం ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సతీమణి కోరం లక్ష్మీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుడ్యానికి కలిగిస్తాయని పేర్కొన్నారు. చిన్నతనం నుండే క్రీడలపట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని, క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరు గెలుపు ఓటములను పట్టించుకోకుండా క్రీడాస్ఫూర్తిని చాటాలని సూచించారు. అనంతరం టోర్నమెంట్స్ నిర్వాహకులు ఎమ్మెల్యే సతీమణి కోరం లక్ష్మీని శాలువాతో ఘనంగా సన్మానించారు..ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ యదళ్లపల్లి అనసూర్య, మాజీ సర్పంచ్ పాయం స్వాతి, మహిళా నాయకురాలు మడుగు వెంకటలక్ష్మి, జిల్లా కాంగ్రెస్ నాయకులు మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, నాయకులు పెద్దినేని హరినాథ్ బాబు, మార్కెట్ రాజు, జాన్సన్, హైజాక్, అలీ భాయ్, సోనీ, శంకర్, మేకల నాగేశ్వరరావు, వెంకటేష్, టోర్నమెంట్ నిర్వాహకులు బొల్లి రాజు, శేఖర్, బన్నీ, అజయ్ రాకేష్, షఫీ, నందులాల్, మాలోత్ రాజేష్, వెంకట్, చింటూ, ఎంపైర్స్ అమ్ముల్, ఆనంద్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## అమలు కాని హామీలు

### కాంగ్రెస్ మాటలు నీటి మూటలు

### రేగా కాంతారావు



*గుండాల. ప్రజా జ్యోతి. 8.*

అమలు కాని హామీలు చెప్పి ప్రజలను నమ్మించి అధికారంలోకొచ్చి హామీలు నెరవేర్చలేదని స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని టిఆర్ఎస్ పార్టీ కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు పినపాక మాజీ శాసనసభ్యులు రేగ కాంతారావు అన్నారు శనివారం గుండాల మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయని హామీలు ఇచ్చి నెరవేర్చలేదని ఆయన అన్నారు 13 నెలలు గడిచిన ఆనాటి ప్రభుత్వ పథకాలను కూడా అమలు చేయలేని పరిస్థితిలో నేటి ప్రభుత్వం ఉందని ఆయన అన్నారు పరిపాలన చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ప్రజలు బుద్ధి చెప్పేందుకు ఎదురుచూస్తున్నారని 13 నెలలు వ్యవధిలోనే ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం పై నమ్మకం కోల్పోయారని ఆయన అన్నారు సంక్షేమ పథకాలు అమలు చేయక అభివృద్ధి పథకాలు చేయక ప్రభుత్వాన్ని నడపలేక టిఆర్ఎస్ పార్టీపై నిన్నెమోపి ప్రయత్నం చేస్తూ ప్రజలు నమ్మియాలని వారి మాటలను ప్రజలు నమ్మేందుకు సిద్ధంగా లేరని ఆయన అన్నారు టిఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమంతో పాటు అనేక అభివృద్ధి పథకాలను ప్రాజెక్టులను లిఫ్ట్ ఇరిగేషన్ తదితర అనేక పథకాలను ప్రజల ముందు ఉంచిందని అయినా అన్నారు గ్యారెంటీ కార్డులను ఇచ్చి 42 హామీలను అమలు చేయకుండా మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి హామీలు ఇచ్చేందుకు చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు స్వీదరించుకుంటూ నారని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్థానిక సంస్థల ఎన్నికల ద్వారా టిఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు తెల్లం భాస్కర్ మోకాళ్ళ వీరస్వామి రవీందర్ రెడ్డి వట్టం రవి తిరువల్లూరి రాము నిట్ట రాములు గడ్డం వీరన్న రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలను సందర్శించిన బాలమేళా బృందం



*టేకులపల్లి, ఫిబ్రవరి 08,ప్రజాజ్యోతి :*

తరగతి గదుల్లో విద్యార్థులు సంపాదించిన జ్ఞానాన్ని, నైపుణ్యాలను పరిశీలన చేసే విధానంలో విద్యాశాఖ ఏర్పాటు చేసిన ఎఫ్ఎల్ఎన్ బాలమేళా బృందం ఎం పి యు పి ఎస్ తావుర్య తండా పాఠశాలను, జడ్పీహెచ్ఎస్ ముత్యాలంపాడు కాంప్లెక్స్ సందర్శించారు. శనివారం టేకులపల్లి మండలం జడ్పీహెచ్ఎస్ ముత్యాలంపాడు కాంప్లెక్స్, యుపిఎస్ తావుర్య తండా పాఠశాలను సందర్శించిన బాలమేళా బృందం పాఠశాలలో తరగతుల వారీగా విద్యార్థుల నైపుణ్యాలను, అభ్యాసన, ప్రగతి సృజనాత్మకత అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులతో చదివించడం, రాయించడం, విభిన్న నేపథ్యాల నుంచి అన్ని కోణాల్లో అంశాలను అడిగి రాబట్టారు. ఉత్త మ విద్యార్థులను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమం లో జడ్పీహెచ్ఎస్ ముత్యాలంపాడు కాంప్లెక్స్ హెచ్ఎం డి. రామచంద్ర సింగ్, యుపిఎస్ తావుర్య తండాహెచ్ఎం బి. సుజాత, ఉపాధ్యాయులు పి. అబ్బయ్య, బి. పద్మ, అంగన్వాడీ టీచర్ స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 20న ఛలో హైదరాబాద్ ను విజయవంతం చేయాలి




*ఇల్లందు, ఫిబ్రవరి 8, ప్రజాజ్యోతి:*

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు, అరు గ్యారంటిలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ న్యూడెమోక్రసి ఆధ్వర్యంలో ఈనెల 20న ఛలో హైదరాబాద్ ను జయప్రదం చేయాలని న్యూడెమోక్రసీ ముకుందాపురం ఏరియా కమిటీ కార్యదర్శి నరాటి వెంకటేశ్వర్లు, పిఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కల్తీ సుభద్ర లు కోరారు. శనివారం మండలంలోని ముకుందాపురం క్యాంప్ సెంటరులో న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం కొరకు ప్రజలకు మొసపూరిత వాగ్దానాలు చేసి, అదికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తి అయినా కానీ ఏ ఒక్క హామీ నెరవేరలేదని ఆరోపించారు. రైతు. రుణ మాఫీ, గృహలక్ష్మీ, మహలక్ష్మీ, ఇందిరమ్మ ఇండ్లు, ఉచితగ్యాస్, తులం బంగారం లాంటి హామీలు అమలు చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సింగం గురుస్వామి, యండి సైదులు, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇగ్నైటింగ్ మైండ్స్ ఆధ్వర్యంలో హెల్త్ అవేర్నెస్ ప్రోగ్రాం



*భద్రాచలం టౌన్, ఫిబ్రవరి 8(ప్రజాజ్యోతి ) :*

శనివారం భద్రాచలంపట్టణంలోని ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆఫీస్ నందు అసోసియేషన్ అధ్యక్షులు బందు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో హెల్త్ అవేర్నెస్ (ఆరోగ్యం అవగాహన) ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యూట్రిషనిస్టులు శ్రుజనాచారి. యాదగిరి సంతపురి వెంకటేశ్వర్లు, డి శ్రీనివాస్, రాజు పాల్గొని ఒబేసిటీ, చక్కెర వ్యాధి, థైరాయిడ్, పి సి ఓ డి, కొలెస్ట్రాల్, గ్యాస్ట్రిక్ వంటి జీవనశైలి వ్యాధులు వాటి సమస్యలపై అవగాహన కల్పించారు . ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కే ఎస్ ఎల్ వి ప్రసాద్ కోశాధికారి కృష్ణమూర్తి ఉపాధ్యక్షులు సుబ్బయ్య రాజబాబు దుర్గాప్రసాద్ బైరి నరసింహారావు విష్ణు మొలకల సుబ్రహ్మణ్యం డి వెంకటేశ్వర్లు పంపన సత్యనారాయణ అక్కయ్య ఐలయ్య నాళం సత్యనారాయణ,పెన్షనర్లు సీనియర్ సిటిజన్స్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## త్రిషాను సన్మానించిన భద్రాచలం ప్రముఖులు



*భద్రాచలం టౌన్,ఫిబ్రవరి 8(ప్రజాజ్యోతి ):*

అండర్ 19 మహిళలు క్రికెట్ వరల్డ్ కప్ సాధించడంలో కీలక పాత్ర పోషించి, మ్యాన్ ఆఫ్ ద సిరీస్ గా నిలిచిన భద్రాచలం పట్టణానికి చెందిన గొంగడి త్రిష ను శనివారం హైదరాబాదులో ఆమె నివాసములో యశోద నగేష్, సంక రాజేంద్రప్రసాద్, పూర్ణచంద్రరావు, హనుమంతరావు మర్యాదపూర్వకంగా కలిసిన శాలువాతో సత్కరించి రాముల వారి జ్ఞాపికను అందజేశారు. వారు మాట్లాడుతూ భవిష్యత్తు లో ఇండియన్ టీం లో స్థానం సంపాదించి అగ్ర స్థానానికి చేరుకోవాలని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తు లో టీమ్ ఇండియా కి ఉమెన్స్ వరల్డ్ కప్ కూడా అందించాలని కోరుకున్నారు.

## ఢిల్లీలో బిజెపి ఘన విజయం పట్ల బిజెపి నాయకులు సంబరాలు



***టేకులపల్లి, ఫిబ్రవరి 08,ప్రజాజ్యోతి :***

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ఘన విజయం సాధించిన సందర్భంగా టేకులపల్లి మండల కేంద్రంలోని బోడు రోడ్ సెంటర్ లో బిజెపి మండల అధ్యక్షుడు శంభు , బీజేపీ టీచర్స్ సెల్ జిల్లా కన్వీనర్ వి.హత్తి రామ్ నాయక్ ఆధ్వర్యంలో శనివారం ఆ పార్టీ నాయకులు బాణాసంచా పేల్చి స్వీట్లు పంచి పెట్టి సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా వి.హత్తి రామ్ మాట్లాడుతూ త్వరలోనే తెలంగాణా రాష్ట్రం లోని జరగబోవు స్థానిక సంస్థ ఎన్నికల్లో బిజెపి మెజారిటీ సీట్లు సాధిస్తుందని తెలిపారు. అదేవిధంగా తర్వాత జరగబోవు తెలంగాణా శాసనసభ ఎన్నికలలో కూడా బిజెపి ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు .ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు చిక్కా వెంకటేశ్వర్లు, ధ్రవ్ సింగ్, మంత్య నాయక్, సురేష్, నరేష్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి వేడుకల కరపత్రాలు ఆవిష్కరణ



***టేకులపల్లి,ఫిబ్రవరి08,ప్రజాజ్యోతి :***

మండలంలోని ఎమ్మార్వో కార్యాలయంలో శ్రీ సంతు సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి వేడుకల కరపత్రాలను ఇస్లావత్ నామానాయక్ ఆధ్వర్యంలో డిప్యూటీ ఎమ్మార్వో పి.ముత్తయ్య చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం నామా నాయక్ మాట్లాడుతూ ఈనెల 15వ తేదీన గోలియా తండ ఇస్లావత్ బుచ్చ నాయక్ ప్రాంగణం సింగరేణి కాలనీ వద్ద సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 286వ వేడుకల సందర్భంగా మహ భోగ్ భండారో నిర్వహించే కార్యక్రమాన్ని గిరిజన లంబాడి సోదరులు, సోదరీమణు లు అత్యధిక సంఖ్యలో పాల్గొని సేవాలాల్ మహారాజ్ తీర్థ ప్రసాదాల స్వీకరించాలని కోరుతున్నారు. ఏ మాట ఒకే బానంగా లంబాడికి నా సోదరులందరూ ఒకే తాటి పై పయనించాలని కోరుతున్నానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇ.సాయి, ప్రవీణ్, రవీందర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఘాతంతో మహిళ మృతి

***ములకలపల్లి,ఫిబ్రవరి 08, ప్రజాజ్యోతి:***

ఇంట్లో నిద్రిస్తున్న మహిళ పై విద్యుత్ తీగలు తెగిపడటంతో మహిళ మృతి చెందిన సంఘటన శనివారం మండలం లో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై కిన్నెర రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం సుబ్బనపల్లి గ్రామానికి చెందిన బండి వెంకటమ్మ (45) తన కుమారుడు రాకేష్ తో కలసి సుబ్బనపల్లి లో నివాసం ఉంటుంది. శుక్రవారం రాత్రి కొడుకు డ్యూటీ కి వెళ్లగా ఒక్కటే ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఇంట్లో ఉన్న విద్యుత్ తీగ తెగిపడటంతో విద్యుత్తు ఘాతానికి గురై మృతి చెందింది. కుమారుడు రాకేష్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# భద్రాద్రిలో ఘనంగా విష్ణుసహస్రనామ పారాయణం

**భక్తులతో పారాయణం చేయించిన చినజీయర్ స్వామి**

**పట్టణంలో ఘనంగా శోభాయాత్ర**

***భద్రాచలం, ఫిబ్రవరి 3(ప్రజాజ్యోతి ):***

భద్రాచలంలో విష్ణుసహస్రనామ పారాయణం ఘనంగా నిర్వహించారు. జీయర్ మఠం , వికాస తరంగిణి, త్రిదండి చినజీయర్ స్వామి పర్యవేక్షణలో భద్రాద్రికి తరలివచ్చిన వేల మంది భక్తుల సమక్షంలో పారాయణంను భద్రాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో ఘనంగా జరిగింది. తొలుత రామాలయం నుంచి మంగళవాయిద్యాలు,





కొమ్ము నృత్యం, కోలాటం, హరిదాసుల భజన బృందాలు, బాలల విచిత్ర వేషదారణలతో శోభ యాత్ర సాగింది. ఈ శోభయాత్రలో అగ్రభాగాన చినజీయర్ స్వామి పాల్గొనగా, సూపర్ బజార్ సెంటరు, గోపాలకృష్ణరోడ్డు, ఆఫీసర్స్ క్లబ్, బ్రిడ్జి సెంటరు, అంబేద్కర్ సెంటర్, కూనవరం రోడ్డు మీదుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంకు చేరుకుంది. అనంతరం క్రీడా ప్రాంగణంలో ఉన్న వేలాది మంది భక్తుల సమక్షంలో విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం నిర్వహించారు. ఈ సమయంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేద పండితులు విష్ణుసహస్రనామ పఠనం గావించారు. అలాగే త్రిదండి చినజీయర్ స్వామి విష్ణుసహస్రనామ పారాయణ ప్రాముఖ్యతను వివరించారు.

# 108 నామాలతో శ్రీ సీతారామచంద్రస్వామి వారికి ఆరాధన

***భద్రాచలం ,ఫిబ్రవరి 8,(ప్రజాజ్యోతి ):***

విష్ణుసహస్రనామ పారాయణం నిర్వహిస్తున్న క్రీడామైదానంలో త్రిదండి చినజీయర్ స్వామి 108 నామాలతో శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆరాధన, నివేదన సాగిస్తూ ఆ నామాల ప్రాముఖ్యతను భక్తులు రీతిలో వివరించారు. పారాయణంలో ప్రతి నామం ఒక ప్రత్యేక విశిష్టతను కలిగి ఉంటుందని, ఆధ్యాత్మిక దైవ చింతన, భక్తిమార్గంను ఆచరించేవారు విష్ణుసహస్రనామ పారాయణం తప్పక పటించాలన్నారు. వేద పండితులతో కలిసి చినజీయర్ స్వామి విష్ణుసహస్రనామ పారాయణం గావించారు.రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు తొలిసారి భద్రాచలంలో ఘనంగా నిర్వహిస్తున్న విష్ణుసహస్రనామ పారాయణంలో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఆధిక సంఖ్యలో భక్తులు, జీయర్ సంస్థల సభ్యులు తరలివచ్చారు. క్రీడ మైదానంతో మొత్తం భక్తులతో నిండిపోయింది. ముఖ్యంగా నల్గొండ జిల్లా నుంచి అధిక సంఖ్యలో భక్తులు రావడంతో వారి కోసం జీయర్ మఠం నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



అలాగే విష్ణుసహస్రనామ పారాయణంలో పాల్గొన్న వారందరికి విష్ణుసహస్రనామ పారాయణం పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. భక్తులందరికి అన్నదానం, తీర్థప్రసాదాలను అందజేశారు.

## సామాన్యులకు మాటలు కార్పొరేట్లకు మూటలుగా కేంద్ర బడ్జెట్

**సిఐటియు మండల కన్వీనర్ నిమ్మల మధు**

***ములకలపల్లి, ఫిబ్రవరి 08, ప్రజాజ్యోతి:***

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ లో పేదలకు మాటలు .. కార్పోరేట్లకే మూటలుగా కేంద్ర బడ్జెట్ ఉందని సిఐటియు మండల కన్వీనర్ నిమ్మల మధు ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలోని సిఐటియు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై రహదారిపై ప్లకార్డులతో నిరసన కార్యక్రమం తెలియజేసినారు. తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఓరుగంటి శ్రీను అధ్యక్షతనలో జరిగిన సభలో నిమ్మల మధు పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో కార్పొరేట్లకు అనుకూలంగా కష్టజీవులకు వ్యతిరేకంగా ఉందని ఆరోపించారు.



అత్యంత దుర్మార్గమైన బడ్జెట్ అని, మోడీ ప్రభుత్వం బరిదేగించి కార్పొరేట్ల కోసం తీసుకొచ్చిన బడ్జెట్ ని దేశ ప్రజలు వ్యతిరేకించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల నాయకులు గడదాసు గోపాలరావు,భూక్య బద్రు,ఆశా వర్కర్ బోర్రా లలిత,మద్దెల యోగి,నాగేష్, రామక్రిష్ణ, సున్నం క్రిష్ణ,తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 10న హైదరాబాద్ లో జరిగే ధర్నాను జయప్రదం చేయండి : ఐద్వా

***కొత్తగూడెం, ఫిబ్రవరి 8 ప్రజాజ్యోతి :***

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రజావ్యతిరేక బడ్జెట్ కు నిరసనగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 10 న హై ద్రాబాద్ లో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి మందలపు జ్యోతి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మంచి కంటి భవన్లో సందకూరి లక్ష్మీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెట్టుబడిదారులకు దోచిపెట్టె పేద ప్రజలకు వ్యతిరేక బడ్జెట్ కు నిరసనగా ఈనెల 10వ తేదీన ఇందిరాపార్కు వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇది బడ్జెట్ కాదు కార్పొరేట్లకు అనుకూలమైనది మహిళా, పేద ప్రజల సంక్షేమానికి ఈ బడ్జెట్ కేటాయింపు లేదని అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వానికి ప్రజల సంక్షేమం, మహిళల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. మహిళా శిశు సంక్షేమానికి మొత్తం బడ్జెట్ జీరో పాయింట్ 53% మాత్రమే మనకు కేటాయించారని అన్నారు. సీఎం ఆవాస్ యోజన పథకం కింద కేటాయింపులు లేవని హింసకు సంబంధించిన కేటాయింపు 50% తగ్గించారని వీటన్నింటి వ్యతిరేకిస్తూ పదవ తేదీన ఇందిరాపార్క్ వద్ద జరిగే ధర్నాలు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సరోజినీ, మచ్చా రమ, గౌసియా, లక్ష్మి, శమంతకమణి, క్రాంతి తదితరులు పాల్గొన్నారు

